


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 20.02.2026 | సంపుటి : 3 | సంచిక :19 | పేజీలు : 9 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Friday | 20.02.2026 | volume : 3 | Issue : 19 | Pages : 9 | Cost : 2/-

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



# మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

### మానవ అభివృద్ధిలో ఏఐది కీలక భూమిక

### భారత్‌లో ఎఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది

### ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని మోడీ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : కృత్రిమ మేధను ఉపయోగించు కోవడం లో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుం దన్నారు. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి

-మిగతా 2 లో..

## సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత

# ప్రతి పౌరుడికి న్యాయం

### ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సిఎం, మంత్రులకు అభినందన
- తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంపై ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతలతో రెండుగంటలపాటు సిఎం, మంత్రుల భేటీ
- మేడారం జాతర నిర్వహించినందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు



**సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు.**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 : ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం

-మిగతా 2 లో..

## టీజీఎస్పీడీసీఎల్‌లో 8 మంది ఇంజనీర్లు సస్పెండ్

### తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 : దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మెుత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు

-మిగతా 2 లో..

# ఉచిత పథకాలపై సుప్రీం సీరియస్

### ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం

### పేదలకు కనీస అవసరాలు కల్పించాల్సిందే

### చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు

దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై

-మిగతా 2 లో..



# 26 నుంచి తెలంగాణ బడ్జెట్

### తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం

### 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 19 : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించ నున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహిం చాలని ప్రభుత్వం

-మిగతా 2 లో..



## ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేపట్టాలి

### బడ్జెట్ కేటాయింపులతో నిజాయితీ చాటాలి

### సిఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 : ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 120 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 147 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 213 (కిలో) |
| స్కిన్ లెస్ | 243 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## పోస్టింగ్‌ల కోసం పోలీసుల తొత్తు వ్యవహారాలు

- ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్
- క్యాతన్‌పల్లిలో బలమున్నా మంత్రి వివేక్ దుర్మార్గం
- వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే.. అప్పడ చూపిస్తాం
- మీడియాతో హరీష్ రావు వ్యాఖ్య..
- జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ



## మేలో పార్టీని ప్రకటిస్తా

### ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం


### అధికారంలోకి రావడం ఖాయం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్,ఫిబ్రవరి 19(ఆర్ఎన్ఎ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా

-మిగతా 2 లో..





## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

### ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు

రాయపూర్, ఫిబ్రవరి 19 : ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు

-మిగతా 2 లో..



# మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేథ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేథ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

# టీజీఎస్పీడీసీఎల్‌లో అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది. అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ శాఖలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మృతి చెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

(మొదటిపేజీ తరువాయి)

పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని,సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

## ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని

# సాధించే దిశగా కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్



అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చేవాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# హామీలపై స్పష్టత ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ,ఇప్పటికీ హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ సారైన బడ్జెట్ లో కేటాయింపులు చేయాలని లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలన్నారు. ఈసారి కూడా హామీల అమలుకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని , మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఈ తరుణంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మీరిచ్చిన హామీల గురించి తెలంగాణ ప్రజల పక్షాన గుర్తుచేసేందుకే ఈ లేఖ రాస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట మభ్యపెట్టి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోని నేపథ్యంలో, కనీసం ఈ సారి బడ్జెట్ లోనైనా అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ నాలుగు కోట్ల ప్రజల పక్షాన మిమ్మల్ని కోరుతున్నానని అన్నారు. వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్కగట్టి ప్రతి పైసాను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించాల్సిన బాధ్యత మీపై ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్ష్మి కింద నెలకు రూ. 2500లు అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క లబ్దిదారుకు ఒక్క పైసా దక్కలేదు. అందుకే ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ఈ గ్యారెంటీ అమలుకు అడుగులు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను. అలాగే కేసీఆర్ గారి హయాంలో తెలంగాణను పంజాబ్ నే తలదన్నేలా, దేశానికే ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రైతులకు అందిన రైతుబంధును 15 వేలకు పెంచుతామని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బడ్జెట్ లో కేటాయించాలని అన్నదాతల పక్షాన కోరుతున్నాను. అలాగే ఇప్పటికే మూడుసార్లు పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలన్న రైతుల డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నాను. అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతున్నాను. కేవలం రైతులు, మహిళలకే కాదు, నిరుద్యోగులకిచ్చిన ప్రతి హామీ కూడా రెండేళ్ల నుంచి పెండింగ్ లోనే ఉంది. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బడ్జెట్ లో కేటాయింపులు చేయాలని తెలంగాణ యువతీ యువకుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అలాగే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న ఆర్థిక సహాయం అందజేయడానికి 2026-2027 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షాన కోరుతున్నాను. ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోంది. అలాగే పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. మొదటి క్యాబినెట్ లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడిగా మీరు హామీ ఇచ్చిన విషయాన్ని మీరు మరిచిపోయినట్టు నటించినా, ప్రజలకు మాత్రం అన్నీ గుర్తున్నాయనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాను. నాటి గ్యారంటీ కార్డులే ఇవాళ బాకీ కార్డులై మీ పాపాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తున్నాయి.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద ఈ రెండేళ్లలో పెళ్లి చేసుకున్న ఆడబిడ్డల తల్లులందరికీ తులం బంగారం బాకీ పడ్డారు. యువ వికాసం కింద రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇవ్వనే లేదు. విద్యార్థినులకు స్కూటీలు రానేలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వేల కోట్లు బాకీ పేరుకుపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం పొంచి ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే 42 పేజీల అభయహస్తం మేనిఫెస్టోలోని 420 హామీల్లో 5 శాతం కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను దగా చేసిన ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మాట మార్చి ఐదేళ్లలో భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొనడం నిరుద్యోగ యువత గొంతుకోయడమే . అంతేకాదు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 4 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్న వాగ్దానాన్ని పూర్తిగా గంగలో కలిపి ఇప్పటివరకు నయా పైసా కూడా చెల్లించకుండా యువతను మోసగించారు. అభయహస్తంలో పొందుపరిచిన గ్యారెంటీలు, 420 హామీల అమలుకు ఎన్ని నిధులు అవసరమో ప్రకటించి బడ్జెట్‌లో ప్రతి పైసాకు లెక్క కట్టాలని తెలంగాణలోని సకల జనుల తరపున డిమాండ్ చేస్తున్నాను. అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

# గద్దర్ జ్యూరీ కమిటీలో మార్పు

## స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో జ్యూరీ కమిటీలో కీలకమైన మార్పు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో భాగంగా ఇచ్చే 'స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, విశ్లేషకుడు తమ్మారెడ్డి భరద్వాజను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు స్వీకరించనున్నారు. చలనచిత్ర పరిశ్రమలో తమ్మారెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవం, సామాజిక అంశాలపై ఆయనకున్న అవగాహనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన ఉత్తేజాన్ని నింపనున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ అవార్డులలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో ఈ నూతన అవార్డులను ప్రతి ఏడాదీ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024 - 25 సంవత్సరంలో విడుదలైన సినిమాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

## 26 నుంచి తెలంగాణ

# బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బడ్జెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19 :** ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసుల అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ను గురువారం పరామర్శించారు. అనంతరం జైలు బయట హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపల్‌లో 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా, చైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి, చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారని ఆరోపించారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. బాల్క సుమన్, కోవ లక్ష్మిలను లోపలికి పంపించకుండా కేవలం కాంగ్రెస్ మంత్రిని ఎలా పంపిస్తారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులే దాడులు చేశారంటూ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి బాల్క సుమన్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్ లో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. జనగామలో ఓటింగ్ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్ చేతి పైకెత్తితే, వెనుక నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతులు పట్టి లాగి బెదిరించే ప్రయత్నం చేశారని, అందులో దళిత మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మెజారిటీ ఉన్నా గాని తాము అరాచకానికి పాల్పడలేదని వెల్లడించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. కాగా, జైల్లో ఉన్న బాల్కసుమన్‌ను హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి రామన్న పరామర్శించారు.



## మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. "భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి. మజ్లిస్ కోసమే భాగ్యనగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి పోయాయి. దిల్లీకి మూటలు పంపేందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా బయటపెడతాం. అవినీతికి సంబంధించిన ఆడియో రికార్డులు మా వద్ద ఉన్నాయి. 2029లో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండదు" అని బండి సంజయ్ అన్నారు.




## రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్లలో 2023లో రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి భూపాలపల్లి కోర్టులో హాజరునుంచి హైకోర్టు మినహాయింపు నిచ్చింది. బహిరంగ సభల్లో తనపై తీవ్ర ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు రేవంత్‌పై 2 కేసులు నమోదయ్యాయి. ఈ రెండు కేసులను కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలుకు గండ్ర తరఫు న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను న్యాయస్థానం 3 వారాలకు వాయిదా వేసింది.



## బాలిక గ్యాంగ్ రేప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** హైదరాబాద్ శివార్లలోని నార్సింగి ప్రాంతంలో అదృశ్యమైన మైనర్ బాలిక కేసు సంచలన మలుపు తిరిగింది. మూడు రోజుల క్రితం పుప్పాలగూడా పాషా కాలనీలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తమ కూతురు కనిపించడం లేదంటూ వారు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో బాలిక అదృశ్యం వెనుక దారుణ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. సోహెల్ అనే యువకుడు బాలికను నమ్మించి తనతో పాటు బయటకు తీసుకెళ్లాడు. అనంతరం ఘట్‌కేసర్ సమీపంలోని రాంపూర్ ప్రాంతానికి తీసుకెళ్లి, తన స్నేహితులు అర్బాజ్, ఇమ్రాన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితులు గంజాయి సేవించిన అనంతరం బాలికపై ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బాలికను మోసం చేసి తీసుకెళ్లి, పథకం ప్రకారం ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# కృత్రిమ మేధ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ

- ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు
- ఇంపాక్ట్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** కృత్రిమ మేధకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్న తెలంగాణా రాష్ట్రం అమెరికా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలను కల్పిస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026' లో భాగంగా దేశ రాజధానిలో అమెరికా- ఇండియా వాజిజ్య మండలి ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యున్నత టెక్నాలిజి ఎకోసిస్టం రాష్ట్రంలో నూతన అవకాశాలను సృష్టించిందని శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికా టెక్ దిగ్గజాలతో పబ్లిక్ ప్రేవేల్ భాగస్వామ్యాన్ని ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముందు చూపుతో కూడిన స్థిరమైన విధానాలు ఏఐ పరిశోధనలకు ఆలంబనగా మారాయని శ్రీధర్ బాబు వివరించారు. ప్రజా సేవలపై రియల్ టైం పర్యవేక్షణతో కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పట్టణాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిన ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ంఎ రంగంలో అగ్రగామిగా నిలబెట్టింది. కృత్రమ మేధ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దు తున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ సంకల్పం అని ఆయన అన్నారు. ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ల ఏర్పాటు, ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం అని వెల్లడించారు.

# తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

### మార్చిలో పరీక్షలకు ఏర్పాట్లు



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల పక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో, బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా స్జబెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.



## కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** మే నెల మొదటి వారంలో తమ పార్టీని ప్రకటిస్తామని తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో బీజేపీ భూస్థాపితం అవుతుందని చేసిన వ్యాఖ్యలపై ఆయన విమర్శలు గుప్పించారు. కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది ఆయన వ్యాఖ్యానించారు. ఆమె పొరపాటున తమ పార్టీ పేరును పేర్కొన్నట్లుగా ఉందని అన్నారు. కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితం అయ్యేది బీఆర్ఎస్ తప్ప తమ పార్టీ కాదని ఆయన అన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు, ఎవరి చేతిలో ఓడిపోయారో ఒకసారి గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్ల శాతం పెరిగిందని రామచందర్ రావు అన్నారు. కాగా, ఈరోజు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శివాజీ దేశం కోసం, ధర్మం కోసం మొఘలులతో పోరాడారని అన్నారు. ఆయన తన హయాంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.

## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం

- సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగులను వాడుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- ప్రభుత్వ, బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలిన నకిలీ సైట్లతో వినియోగదారులకు వల
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి
- పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** సాంకేతికత పెరిగాక ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే, మనకున్న ఈ అలవాటే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారింది. సెర్చ్ ఫలితాల్లో అగ్రస్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, సురక్షితమైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. సైబర్ మోసగాళ్లు ఇప్పుడు 'సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్' (ఎస్ఈవో) అనే అధునాతన టెక్నిక్‌ను, పెయిడ్ ప్రకటనలను వాడుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ పోర్టల్స్, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లతో అచ్చుగుద్దినట్టు ఉండే నకిలీ 'ఫిషింగ్' వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర సేవల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ సైట్లు సెర్చ్ ఫలితాల్లో టాప్‌లో కనిపించేలా చేస్తున్నారు. వీటిపై 'హజూశీఅంశీతీవస' లేదా 'ూాస' అని చిన్న అక్షరాలతో ఉంటుంది. వాటిని గమనించకుండా నిజమైన వెబ్‌సైట్ అని భ్రమపడి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుంది. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే వ్యక్తిగత వివరాలు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, ఓటీపీ వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఆ వివరాలు వారికి చిక్కగానే క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తారు. కేవలం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా, మీ గుర్తింపు పత్రాలను దొంగిలించి 'ఐడెంటిటీ థెఫ్ట్'కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. అంటే మీ పేరు మీద రుణాలు తీసుకోవడం లేదా ఇతర నేరాలకు పాల్పడటం వంటివి చేయవచ్చు. ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు. ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని చిరునామా ను క్షుణ్ణంగా పరిశీలించాలి. సెర్చ్ ఫలితాల్లో Sponsored' అని కనిపించే లింకులపై క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు జాగ్రత్త అవసరం. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో మన అప్రమత్తతే మనకు రక్షణ కవచమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.




## ఏప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

### సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఈసీ ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ పక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాలప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ పక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.

## రూ.13,000 కోట్ల గేమింగ్ స్కామ్

- హైదరాబాద్‌లో కీలక సూత్రధారి అరెస్ట్..
- హైదరాబాద్‌లో పంకజ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న జీఎస్టీ అధికారులు
- నకిలీ కేవైసీలతో గేమింగ్ వెబ్‌సైట్లకు సహకరించినట్టు ఆరోపణలు
- పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులను మోసం చేసినట్టు గుర్తింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.13,000 కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్‌లో హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ భారీ మోసంలో ప్రధాన సూత్రధారులలో ఒకరైన పంకజ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అడ్సమ్ అడ్వైజరీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌గా ఉన్న పంకజ్ కుమార్, ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించినట్టు అధికారులు గుర్తించారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లకు అండగా నిలుస్తూ, వాటి కార్యకలాపాలకు సహకరించడమే లక్ష్యంగా ఈ సిండికేట్ పనిచేసింది. ఇందులో భాగంగా, పంకజ్ కుమార్ నకిలీ కేవైసీ పత్రాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషించారు. డొల్ల కంపెనీలు (షెల్ ఎంటిటీలు), నకిలీ వ్యాపారుల పేరిట మోసపూరిత కేవైసీలను తయారు చేసి, వాటి ద్వారా ఆర్‌బీఐ నియంత్రణలో ఉండే పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకుల నుంచి పేమెంట్ అగ్రిగేటర్ సేవలను పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నకిలీ కేవైసీల ద్వారా గేమింగ్ వెబ్‌సైట్లు తమ అక్రమ లావాదేవీలను చట్టబద్ధమైనవిగా చిత్రీకరించే ప్రయత్నం చేశాయి. ఫిన్‌టెక్ కంపెనీల సహాయంతో ఈ వ్యవస్థీకృత ముఠా భారీ ఎత్తున మోసాలకు పాల్పడినట్టు జీఎస్టీ అధికారులు తెలిపారు. ఈ కేసులో పంకజ్ కుమార్ అరెస్ట్ అత్యంత కీలకమని, దర్యాప్తును మరింత లోతుగా కొనసాగిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## 20 ఏళ్లుగా పార్టీని పీడిస్తున్న కోవర్టులంతా వెళ్లిపోండి

### నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



**నిజామాబాద్ :** బీజేపీలో ఉంటూ 20 ఏళ్లుగా పార్టీని పీడిస్తున్న కోవర్టులు వెళ్లిపోవాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ బాగా బలపడిందని, దక్షిణ తెలంగాణలో మరింత బలోపేతం కావాల్సి ఉందని అన్నారు. బీజేపీ భూస్థాపితం అవుతుందన్న కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అర్వింద్ కొట్టిపారేశారు. "ఎవరి వల్ల ఎవరు భూస్థాపితం అయ్యారో మీకు తెలియదా?" అని కవితను ప్రశ్నించారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ కు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని, కేసులు ఉన్నందువల్లే అండగా నిలిచిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో నిజామాబాద్‌లో బీజేపీ ఓటమి పాలైంది. ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ 17 స్థానాల్లో గెలిచి, ఎంఐఎం (14 డివిజన్లు), ఇద్దరు ఎక్స్‌అఫీషియో సభ్యులు, మరో బీఆర్ఎస్ అభ్యర్థి మద్దతుతో సంఖ్యా బలాన్ని 34కి చేర్చుకుంది. బీజేపీ 28 స్థానాల్లో విజయం సాధించినా మేయర్ పీఠం దక్కలేదు.

# దూసుకువస్తున్న ఏఐ అప్రమత్తతే ముఖ్యం!




**ఏఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది.**

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది.

సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్ధవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్సిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

# డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

- కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి
- విశాఖ మీదుగా ఐఐటి ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాడిని
- అదే విశాఖలో ఇప్పుడు గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం
- ఏఐ సదస్సులో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతు న్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రివమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించా రు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిట ల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగు తోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోం దన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

# జాతిపిత గాంధీతో కెసిఆర్‌కు పోలికా

- జాతిపిత అని చెప్పకోవడానికి సిగ్గుండాలి
- ప్రజల సమస్యలపై ఎందుకు మాట్లాడరు..
- ఎందుకు అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తారు
- కెసిఆర్ జాతిపిత ప్రకటనపై మండిపడ్డ కడియం శ్రీహరి



**జనగామ, ఫిబ్రవరి 19 :** తెలంగాణ రాజకీయాల్లో 'జాతిపిత' అనే పదం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆయన పార్టీ నేతలు 'తెలంగాణ జాతిపిత'గా అభివర్ణించడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా తప్పుబట్టారు. భారతదేశానికి జాతిపిత ఒక్కరేనని, ఆయన మహాత్మా గాంధీ అని.. అలాంటి మహనీయుడితో కెసిఆర్‌ను పోల్చడం గాంధీజీని అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. అసలు కెసిఆర్ కు జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఆయన అత్యంత ఘాటుగా విమర్శించారు. నిజంగానే కెసిఆర్ జాతిపిత అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని కడియం శ్రీహరి ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడాల్సిన ప్రతిపక్ష నేత, అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎందుకు నిలదీయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం సెంటిమెంట్‌ను వాడుకుని రాజకీయాలు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తీర్చే ఉద్దేశం కెసిఆర్‌కు లేదని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని కడియం ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి, ఓటు వేయడానికి ఇష్టపడలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను కూలిపోయేలా నిర్మించడమే కాకుండా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాళా తీయించారు. ఎన్నో స్కామ్‌లలో ఇరుక్కున్న నేతను జాతిపిత అని ఎలా పిలుస్తారని ఆయన నిప్పులు చెరిగారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదని కడియం దుయ్యబట్టారు. వారి అహంకారం, అహంభావం వల్లే ప్రజలు వారికి దూరమయ్యారని, ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారని, ఇది ఎవరి సొత్తు కాదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రవర్తించకపోతే భవిష్యత్తులో ప్రజలు మరింత గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.



# కడియం శ్రీహరీ.. నోరు అదుపులో పెట్టుకో

## కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద అన్నారు. కేసీఆర్ జాతిపిత ఎలా అవుతాడని కడియం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కడియం శ్రీహరి తన హోదాకు మించి మాట్లాడుతున్నాడు. కడియం లాగ కేసీఆర్ ఎప్పుడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు బెట్టుకొని, పదవుల కోసం పాకులాడి, బేరసారాలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, 13 సంవత్సరాలు నిరంతరం పోరాడాడని ఇదే కడియం శ్రీహరి అనలేదా అని సూటిగా ప్రశ్నించారు. ఈరోజు ఏ మొహం పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేస్తున్నాడు ఆయనకే తెలియాలన్నారు. రాజకీయ అవసరాల కోసం రంగులు మార్చిన నీ లాంటి వారు కేసీఆర్‌ను అనే అర్హతల లేదని విమర్శించారు. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు.

# నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

## 37మందిని బలి తీసుకున్న ఘటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమమైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

# పంజాగుట్ట చట్నీస్ మెట్ల వ్యవహారం

## హైడ్రా జోక్యంతో పరిష్కారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** హైదరాబాద్‌లోని చట్నీస్ పంజాగుట్ట బ్రాంచ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న వివాదానికి హైడ్రా అధికారులు తెరదించారు. చట్నీస్ హోటల్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మూసివేసిన మెట్ల మార్గాన్ని హైడ్రా అధికారులు గురువారం తెరిపించారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యపై హైడ్రా తీసుకున్న నిర్ణయం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. పంజాగుట్టలోని చట్నీస్ హోటల్ నిర్వాహకులు భవనంలోని పై అంతస్తులకు వెళ్లే మెట్ల మార్గాన్ని నిబంధనలకు విరుద్ధంగా మూసివేసి అడ్డంకులు సృష్టించారని బాధితులు ఆరోపించారు. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయం నుంచి పైఅంతస్తుల్లోని ఇతర యజమానులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా భవనంలోని ఇతర యజమానులు తమ వ్యాపారాలకు, రాకపోకలకు ఆటంకం కలుగుతోందని జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అయితే ఈ సమస్యపై బాధితులు ఇటీవల హైడ్రా అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన హైడ్రా బృందం ఇవాళ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వెంటనే ఆ మెట్ల మార్గాన్ని తెరిపించారు. హైడ్రా రాకతో తమ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందంటూ బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జోగిపేట బస్టాండ్‌లో భారీ చోరీ

- బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో బంగారం చోరీ
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 :** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఓ శుభకార్యానికి వెళ్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. ఆమె బ్యాగులోని 16 తులాల బంగారాన్ని అత్యంత చాకచక్యంగా అపహరించారు. అల్లాదుర్గానికి చెందిన చెగురి లక్ష్మి అనే వృద్ధురాలు.. హైదరాబాద్‌లోని తన మేనకోడలి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరింది. క్రమంలో అల్లాదుర్గం నుంచి జోగిపేట బస్టాండ్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ దిగి, తన బంధువుతో కలిసి హైదరాబాద్ వెళ్లే మరో బస్సు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీని అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు.. ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బంగారం పోయిందని గుర్తించిన బాధితురాలు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికల ఆధారంగా నిందితుడిని పట్టుకునేం దుకు గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విలువైన వస్తువులు తీసుకెళ్తు న్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడిని త్వరగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

## దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో

# ఏసీబీ సోదాలు

## రికార్డులు, లావాదేవీలపై అధికారుల తనిఖీలు

**మేడ్చల్, ఫిబ్రవరి 19 :** మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాలోని దుండిగల్‌లోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. పరిపాలనా రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, హాజరు రిజిస్టర్లు, పెండింగ్ దరఖాస్తుల వ్యవహారంపై విచారణ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం మొత్తం పనితీరుపై ఆడిట్, టెక్నికల్ విభాగంతో సహా సంబంధిత విభాగాలు సహాయం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో మున్సిపల్ కార్యాలయంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లపై లంచాల ఆరోపణలు వెల్లువెత్తాయి. టౌన్ ఎ÷–లానింగ్ సూపర్‌వైజర్ లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వాట్సాప్ చాట్‌లో ఈ వ్యవహారం బయటపడింది. సూపర్‌వైజర్ భర్త కంపెనీకి అనధికారికంగా నిధులు మళ్లించినట్లు గుర్తించారు. సోదాలు జరిగే సమయంలో ఒక అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఐదుగురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గైర్హాజరైనట్లు తెలిపారు. ÷ూఈం÷ూ ద్వారా పారిశుధ్య కార్మికుల హాజరు రికార్డులను తారుమారు చేసినట్లు గుర్తించారు. 49 భవనాల నిర్మాణాలకు కావాల్సిన అనుమతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 21 రోజుల పరిమితికి మించి 12 ఉన్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. అలాగే, 32 అనధికార నిర్మాణ కేసుల్లో 28 కేసుల్లో రెండవ నోటీసులు జారీ చేయకపోవడం, ఉ?5 అనధికార భవనాలకు ఉ?3 అనుమతిని అక్రమంగా మంజూరు చేసినట్లు గుర్తించారు. అధికారులపై వచ్చిన ఆరోపణలతో వారి ఖాతాల బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఏసీబీ అధికారులు పరిశీలించనున్నారు. ఈ సోదాల్లో కార్యాలయ రికార్డులు, రిజిస్టర్లు, ÷ల్ నోట్స్, డిజిటల్ డేటా స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై అవసరమైన చర్యలకు సిఫార్సు చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు నివేదిక ఇవ్వనున్నారు.



## తెల్లాపూర్ 263 డివిజన్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలకు తెల్లాపూర్ 263 డివిజన్ వేదికగా మారింది. ఉదయం 8 గంటలకు శివాజీ యూత్ ఆధ్వర్యంలో యువకులు డివిజన్ కు సంబంధించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు అభిమానులు పాల్గొని శివాజీ ఫ్లెక్సీల తో తెల్లాపూర్ ఏలియన్స్ స్పేస్ స్టేషన్ నుంచి ఇందిరానగర్ సర్కిల్ వరకు భారీగా ఊరేగింపుగా వచ్చి ఇటీవల స్థాపించిన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తూ ఘనంగా శివాజీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమ ర్యాలీలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు, శివాజీ అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మెడలో కాషాయపు కండువాలను ధరించి కాషాయపు జెండాలతో శివాజీ వీరత్వం ఉట్టిపడేలా యువకులు నినాదాలు చేసుకుంటూ గ్రామ పురవీధుల నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని పూర్తిగా స్థానిక కొల్లూరు పోలీస్ స్టేషన్ అధికారులు పోలీసుల పర్యవేక్షణలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా గట్టి బందోబస్తు మధ్య ఈ ర్యాలీ ని కొనసాగింప చేశారు. హైందవ స్వరాజ్య స్థాపకుడు, పరాక్రమశాలి మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.



## రామచంద్రాపురంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** బహుజన చక్రవర్తి మరాఠా రాజ్యం వ్యవస్థాపకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 వ జయంతి వేడుకలు రామచంద్రపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా బి ఎస్ పి పటాన్ చెరువు నియోజకవర్గం ఇన్చార్జి సుంకు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. శివాజీకి ఘనంగా నివాళులు అర్పించి, వీర యోధుడు శివాజీ పై స్లోగన్లు పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ కేవలం ఒక వర్గానికో లేదా ఒక మతానికో అంకితం చేయబడ్డారు. శివాజీ నిజమైన చరిత్రను దాచి చరిత్రను వక్రీకరించి అతను కేవలం ఒక హిందూ రాజుగా ముద్ర వేయబడ్డారు. కానీ అతను కేవలం ఒక మతానికి చెందిన వ్యక్తి కాదు అతనికి కుల బేధం కానీ మత భేదం కానీ లేకుండేది. అతను అందరిని సమానంగా చూశారు. హిందువులతోపాటు చాలామంది ముస్లింలను కూడా తన సైన్యం లో ముఖ్యమైన హోదాలో ఉంచారు. చత్రపతి శివాజీ జయంతులు వర్ధంతులు కులమత బేధాలు లేకుండా అందరూ ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని వక్తలు వ్యాఖ్యానించడం జరిగింది. కార్యక్రమంలో సుంకు వినయ్ కుమార్, సుంకు రాజేందర్, బల్ల దశరథ్,అక్బర్,జబ్బర్,నందిగామ రాజేష్, సుంకు పవన్,యాదగిరి, బోండ్ల కృష్ణ , సుంకు సురేందర్,గంజాయి అజయ్, రమణ, మన్నే సుశీల, స్వరూప, జయ, యాదమ్మ, ఎడ్ల రమేష్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**రామారెడి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామములో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం రోజున శివాజీ విగ్రహానికి పూలమాలలతో సత్కరించి, జెండా ఆవిష్కరించి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు, ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఆకుల లింగం, కుమ్మరి శంకర్, ఆకుల సురేష్, ఆకుల నరేష్, కాల శ్రీను, ఆయా పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఇద్దరు మహిళలు అదృశ్యం

### పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చేవెళ్ల మున్సిపల్ కు చెందిన ఆలంపల్లి కవిత భర్త ఆలంపల్లి సత్యనారాయణ (30) ఆలంపల్లి స్వాతి భర్త ఆలంపల్లి ప్రశాంత్ లు తమ పిల్లలు నాని (6), కుట్టి (3)లతో ఈ నెల 14న సాయంత్రం కుటుంబ సభ్యులకు చెప్పకుండా పిల్లలను తీసుకుని వెళ్లిపోయారు. తిరిగి ఇంటికి రాక పోవటంతో కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన వారిని ఆరాతీశారు. అయినా ఆచూకి లేకపోవటంతో ఈ నెల17న కనిపించడం లేదంటూ చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు మహిళలు కనిపించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కవిత భర్త ఫిర్యాదు వివరాల ప్రకారం.. చేవెళ్ల పట్టణ కేంద్రంలో పండ్లు, పూల వ్యాపారం నిర్వహిస్తున్న కవిత ఈ నెల 14వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో తన భార్య కవిత, తన తమ్ముడు ప్రశాంత్ భార్య స్వాతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని అదృశ్యమయ్యారని తెలిపారు. ఆ తర్వాత ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పాటు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని కవిత భర్త సత్యనారాయణ పేర్కొన్నారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళ మిస్సింగ్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.





## ప్రజల కష్టాలు తీర్చేందుకే సొంత నిధులతో సిసి రోడ్డు

### మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పదవులు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడి సేవ చేయడమే ధ్యేయమని మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ తెలిపారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని మేడిపల్లి డివిజన్ గణేష్ నగర్ కాలనీలో దశాబ్ద కాలంగా నెలకొన్న రహదారి సమస్యకు ఆమె స్వస్తి పలికారు. కాలనీలోని శ్రీ సాయి గ్రాండ్ హోమ్స్ అపార్ట్మెంట్స్ దారిలో వర్షం వస్తే చాలు నీరు నిలిచి, బురదమయంగా మారి స్థానికులు నరకయాతన అనుభవించేవారన్నారు. ఈ సమస్యను గుర్తించిన వారు, ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా తన ఉదారతను చాటుకున్నారు. సుమారు 100 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మాణాన్ని తన సొంత నిధులతో పూర్తి చేయించి కాలనీ వాసులకు అంకితం చేశారు. రోడ్డు పనులు పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి రమ్య సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం తాను ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. వర్షాకాలంలో అపార్ట్మెంట్ వాసులు, ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన సిసి రోడ్డును నిర్మించడం ద్వారా ఇది దీర్ఘకాలం పాటు ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో డివిజన్ వ్యాప్తంగా ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజా సేవలో తనకు ఏదీ అడ్డురాదని భరోసా ఇచ్చారు. తమ కష్టాలను గుర్తించి వెంటనే స్పందించి, సొంత ఖర్చుతో రోడ్డు వేయించిన మాజీ కార్పొరేటర్ పట్ల



కాలనీ వాసులు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి గ్రాండ్ హోమ్స్ భాగ్యలక్ష్మి అపార్ట్మెంట్స్ అధ్యక్షురాలు నవ్య, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, కోశాధికారి భార్గవ్, స్థానిక నాయకులు శేఖర్ పల్లపు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మరణ ధ్రువ పత్రంతో ప్లాట్ కాజేసిన ఘనుడు

### ప్రాణంతో ఉన్న మహిళను చంపేసి మరణ ధృవీకరణ పత్రం సృష్టించి అక్రమ విక్రయం

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బతికి ఉన్న మహిళను చనిపోయినట్లు నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించి, ఆమె విలువైన భూమిని కాజేయాలని చూసిన ఓ కేటుగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దారుణ మోసం బోడుప్పల్ ప్రాంతంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. బోడుప్పల్ గ్రామంలోని సర్వే నంబర్లు 56, 57, ఫ్లాట్ నెంబర్ 2 లోగల 310 చదరపు గజాల ప్లాట్‌ను యశోద అనే మహిళ 2001లో చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉంది. అయితే, కాచాటి శ్రీహరి అనే వ్యక్తి కన్ను ఈ ప్లాట్‌పై పడింది. యశోద జీవించి ఉన్నప్పటికీ, ఆమె మరణించినట్లు తప్పుడు మరణ ధృవీకరణ పత్రం, నకిలీ వారసత్వ ధృవీకరణ పత్రాలను పకడ్బందీగా సృష్టించాడు. ఆ తర్వాత, పాచునూరి గీత అనే మహిళ ద్వారా ఉప్పల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పేరు మీద తప్పుడు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఏ)ని నమోదు చేయించుకున్నాడు. ఈ అక్రమ జిపిఏ ఆధారంగా, సదరు భూమిని బొడుప్పల్‌కు చెందిన సునీత అనే మహిళకు సేల్ డీడ్ ద్వారా విక్రయించాడు. ఈ మోసాన్ని ఆలస్యంగా



గుర్తించిన యశోద కుమారుడు తోకల గోపాల్, ఈ నెల 13న పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు జరిపి, ప్రధాన నిందితుడు కాచాటి శ్రీహరిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు శ్రీహరిని జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.



## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** నల్లగండ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో స్వరాజ్య స్థాపకుడు, మహానేత "ఛత్రపతి శివాజీ మహారాజ్" జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ మాట్లాడుతూ.. "హిందవ ధర్మ రక్షకుడు, అపార ధైర్యసాహసాల ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యం, పరాక్రమం, దేశభక్తి మనందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలి. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది దేశభక్తి, సేవా భావంతో ముందుకు సాగాలి" అని తెలిపారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల గ్రామ సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## హిందూ సనాతన ధర్మానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

### హిందు బంధువు చావాకిరణ్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతీయ చరిత్రలో ధైర్యసాహసాల కు, స్వపరిపాలనకు, హిందూ సనాతన ధర్మానికి ప్రతీకగా చత్రపతి శివాజీ మహారాజ్ నిలిచారనీ హిందు బంధువు చావా కిరణ్ అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం హిందూ సామ్రాట్,మరాఠా సామ్రాజ్యాధిపతి చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను హిందువుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మాట్లాడుతూ చిన్న వయసులోనే గెరిల్లా యుద్ధ తంత్రం ద్వారా మొఘల్,బీజాపూర్ సుల్తానులను ఎదిరించి రాయఘడ్ కోటలో చత్రపతి గా పట్టాభిషేకం చేసుకుని స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించారని తెలిపారు. మహిళల పట్ల గౌరవం,పర మతాల పట్ల సహనం పాటిస్తూ న్యాయ పరిపాలన వ్యవస్థను అమలు చేశారని చెప్పారు. దూర దృష్టి కలిగిన ఆయన భారతదేశ తీరప్రాంతాన్ని రక్షించడానికి బలమైన నౌకాదళాన్ని నిర్మించి భారత నౌకాదళ పితామహుడుగా నిలిచారని కొనియాడారు. శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలు నేటికీ ఎందరికో స్ఫూర్తి దాయకం అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందువులు నున్నా రవికుమార్,పాగర్తి సుధాకర్, మల్లేబోయి న గోవిందరావు, బాజా రామకృష్ణ,సూరేపల్లి జ్ఞానరత్నం, కొదమగండ్ల స్వామి దాస్,కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి,తంగెళ్ల సతీష్,జెల్లా సురేష్,కట్టా అప్పారావు, తేజావత్ మల్లికార్జున్, ఎలిగేటి గిరి,కందరబోయిన వెంకటరమణ,అల్లి భూలక్ష్మి,రమాదేవి,మూడు రమేష్,ఉదయ్,నాగరాజు,వీరు నాయక్, పుట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు.. భర్తను చంపిన భార్య

**గుంటూరు :** గుంటూరు జిల్లాలో గురువారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. టీవీ సౌండ్ తగ్గించమని అడిగిన భర్తను.. భార్య దారుణంగా హత్య చేసింది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి టిడ్కో ఇళ్ల సముదాయంలో ఈ దారుణ ఘటన జరిగింది. టీవీ సౌండ్ తగ్గించమని భర్త అహ్మద్.. భార్య క్రాంతిని కోరాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారస్థాయికి చేరడంతో అహ్మద్‌ను క్రాంతి కత్తితో పొడిచి చంపేసింది. అహ్మద్, క్రాంతి ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకోవడం గమనార్హం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి జీవిత ఖైదు



**దక్షిణ కొరియా :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో మార్షల్ లా విధించిన కేసులో తీర్పు వెలువడింది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతల ను అరెస్టు చేసేందుకు, అనియం త్రిత అధికారాన్ని చెలాయించేం దుకు సైన్యం, పోలీసు బలగాలను సమీకరించినందుకుగానూ తిరుగు బాటు కింద ఆయన్ను దోషిగా నిర్ధరించినట్లు న్యాయమూర్తి జీ కుయ్-యోన్ తెలిపారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ప్రకటనను విరమించుకున్నా రు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవి కోల్పోయారు. 'మార్షల్ లా' విషయంలో ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించా యని ఆరోపిస్తూ.. ఆయనకు మరణశిక్ష విధించాలని ప్రత్యేక ప్రాసిక్యూటర్ వాదించారు. చివరకు కోర్టు జీవిత ఖైదు విధించింది. 'మార్షల్ లా' అమలులో భాగమైన అనేక మంది మాజీ సైనిక, పోలీసు అధికారులకూ కోర్టు శిక్ష విధించింది. రక్షణశాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. అనేక కేసులు ఎదుర్కొంటున్న యూన్ సుక్ యోల్ గతేడాది జులై నుంచి జైల్లో ఉన్నారు. ఓ కేసులో గత నెలలో ఆయనకు ఐదేళ్ల శిక్ష పడింది. మరోవైపు.. జీవిత ఖైదు పడిన మొదటి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు ఆయనే కావడం గమనార్హం. ఈ తీర్పుపై ఆయన అప్పీల్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం..

## బ్రిటన్ రాజు ఛార్లెస్ సోదరుడి అరెస్ట్



**యూకే :** ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వాటి ల్లో పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఫైళ్లలో బ్రిటన్ రాజు సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ పేరు కూడా ఉండటంతో అక్కడ రాజకీయంగా దుమారం రేగుతోం ది. ఈ నేపథ్యంలో ఆయన్ను అరె-స్టు చేసినట్లు గురువారం యూకే పోలీసులు వెల్లడించారు. పదవీ దుర్వినియోగం ఆరోపణల కింద ఒక వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నా మని పేర్కొన్నారు. మాజీ యువరాజు పేరు చెప్పకుండా ఈ అరెస్టు గురించి ప్రకటించారు. ఆండ్రూ.. బ్రిటన్‌రాజు ఛార్లెస్‌కు స్వయాన సోదరుడు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో పేరు వెలువడినప్పటినుంచి ఆండ్రూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా అమెరికాకు చెందిన ఓ బాధితురాలు ఆయనపై లైంగిక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 17 ఏళ్ల వయసులో తనపై మూడుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని ఆరోపించింది. ఆ పరిణామాల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను ఆండ్రూ వదులుకోవాల్సి వచ్చింది. అన్ని రాజ బిరుదులు, గౌరవాలు, అధికారాలను రాజు చార్లెస్ తొలగించారని బకింగ్‌హామ్ ప్యాలెస్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దాంతోపాటు ఆయన్ను బలవంతంగా ఇంటి నుంచి పంపించేశారు. ఈ కేసులో కఠినచర్యలు అనివార్యమని రాజు భావిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా రాజు చార్లెస్, రాణి కెమిల్లా.. బాధితుల వైపే ఉంటారని రాజభవన వర్గాలు స్పష్టం చేశాయి.



# అమెరికా దాడుల భయం..

## అణుస్థావరాల రక్షణకు ఇరాన్ చర్యలు

**ఇరాన్ :** అణు ఒప్పందానికి సంబంధించి ఇరాన్- అమెరికాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని మోహరిస్తున్న నేపథ్యంలో.. ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకవేళ యూఎస్ దాడులకు పాల్పడినా.. వాటిని తట్టుకుని నిలబడేలా అణుస్థావరాలపై గట్టి బంకర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వాషింగ్టన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. గత రెండు వారాల్లో ఇరాన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని న్యూ తలేఘాన్-2 కేంద్రంపై కాంక్రీటుతో ఓ లేయర్‌ను ఏర్పాటుచేసిందని ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. ఈ తలేఘాన్-2 టెహ్రాన్‌కు 30 కి.మీల దూరంలో ఉంది. ఫిబ్రవరి 13 నాటి శాటిలైట్ చిత్రాల ప్రకారం.. అణుస్థావరం మొత్తాన్ని పూర్తిగా కాంక్రీట్‌తో కప్పేశారు. ఇప్పుడు దానిపై మట్టి పోస్తున్నారు. ఇది త్వరలోనే పూర్తి బంకర్‌గా మారిపోతుందని, వైమానిక దాడుల నుంచి దీనికి రక్షణ లభిస్తుందని ఐఎస్ఐఎస్ అధ్యక్షుడు డేవిడ్ అల్‌బ్రైట్ పేర్కొన్నారు. కోలాంగ్-గాజ్‌లా పర్వతం కింద సొరంగ మార్గాలను తవ్వినట్లు ఫిబ్రవరి 10 నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. నటాంజ్ అణుశుద్ధి కేంద్రం నుంచి ఇది దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రయత్నాలన్నీ సొరంగంపై జరిగే వైమానిక దాడుల నుంచి రక్షణ కల్పించేందుకేనని సంస్థ పేర్కొంది. ఈ ప్రాంతంలో కొన్ని వాహనాల కదలికలను గుర్తించింది. లోపల ఇరాన్ ఏవో కార్యకలాపాలు చేపడుతున్నట్లు సంస్థ అనుమానిస్తోంది. ఎస్ఫహాన్ అణుకేంద్రం వద్ద కూడా రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈనెల 8 నాటి ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి.

# ఇకపై వారికి 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'

## ఇమిగ్రేషన్ రూల్స్‌లో కెనడా మార్పులు




**కెనడా :** వలసదారుల కట్టడికి కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓవైపు శాశ్వత నివాస వలసదారుల సంఖ్యను పరిమితం చేస్తూనే.. ప్రతిభావంతులకు మరింత ఎక్కువగా ప్రవేశం కల్పించేలా ఇమిగ్రేషన్ నిబంధనల్లో మార్పులు చేసిం ది. పరిశోధకులు, వైద్యులు, పైలట్ల కోసం ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్‌లో కొత్త ప్రాధాన్యత కేటగిరీలు ప్రవేశపెట్టింది. ఆరోగ్య సంరక్షణ, విమానయానం, రక్షణ రంగాల్లో కార్మిక కొరతను పూడ్చటమే లక్ష్యంగా ఈ నూతన నిబంధనలను రూపొందించి నట్లు కెనడా ఫెడరల్ ప్రభుత్వం వెల్లడించింది. 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ' అనేది నైపుణ్య కార్మికుల ఇమిగ్రే షన్ దరఖాస్తులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వ్యవస్థ. ఈ సదు-పాయంతో ప్రతిభావంతులు త్వరగా శాశ్వత నివాసం పొందే వీలు లభిస్తుంది. మిగతా ఇమిగ్రేషన్ విభాగాలతో పోలిస్తే దీనికి ప్రాసెస్ సమయం చాలా తక్కువ. దాదాపు 6 నెలలు అంతకంటే తక్కువ వ్యవధిలోనే శాశ్వత నివాసం పొందొచ్చు. ప్రస్తుతం ఈ 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'లో ఫ్రెంచ్ లాంగ్వేజ్ అభ్యర్థులు, హెల్త్‌కేర్ వర్కర్లు, నైపుణ్యం గల ట్రేడర్లు వంటి కేటగిరీలు ఉన్నాయి. ఇప్పుడు తాజా నిబంధనలతో రీసెర్చర్లు, పైలట్లు, డాక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ మెకానిక్స్, సీనియర్ మేనేజర్లు, మిలిటరీ డాక్టర్లు, నర్సులు వంటి కేటగిరీలను కూడా చేర్చారు. ఈ విభాగాల్లో నైపుణ్యం గల వ్యక్తులు కెనడా శాశ్వత నివాసం కోసం ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ కింద దరఖాస్తు చేసుకోవచ్చని ఇమిగ్రేషన్ మంత్రి లీనా మెట్లేజ్ డయాబ్ వెల్లడించారు. కీలక రంగాల్లో కార్మిక కొరతను తీర్చడంతో పాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. వలసదారుల విషయంలో కెనడా కొన్ని రోజులుగా కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. హౌసింగ్, సోషల్ సర్వీసెస్ వంటి విభాగాల్లో శాశ్వత నివాస హోదాను పరిమితం చేసింది.


# పంచుకుంటూ పోతే ఒక్క పైసా మిగలదు

## తమిళనాడు 'ఉచిత విద్యుత్'పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ముందే రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకొస్తున్నాయని ప్రశ్నించింది. దేశాభివృద్ధికి ఆటంకం కలిగించే ఈ తరహా విధానాలపై పునఃసమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. వినియోగదారుల ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఇందుకోసం 2024 ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గురువారం విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతున్నప్పటికీ ఉచిత పథకాల పంపిణీ కొనసాగుతోంది. ఇలాంటి పథకాలతో రాష్ట్రాలతో పాటు దేశాభివృద్ధికి విఘాతం కలుగుతోంది. ఆహారం, విద్యుత్.. ఇలా అన్నీ ఉచితంగా ఇస్తూ పోతుంటే మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాం? సంక్షేమ చర్యల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే స్తోమత లేనివారికి ఉచిత విద్యుత్ అందిస్తారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచితంగా విద్యుత్ పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ఇది బుజ్జగింపు రాజకీయ విధానం కాదా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. విద్యుత్ టారిఫ్‌లను నోటిఫై చేసిన తర్వాత ఉన్నట్టుండి ఉచిత విద్యుత్‌పై ప్రకటన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సీజేఐ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల ముందే రాష్ట్రాలు ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకొస్తున్నాయని ఆగ్రహించింది. ఇలా ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా పంచుకుంటూ పోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొంది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ పిటిషన్‌పై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

# బెంగళూరు, ముంబయికి ఓపెన్ ఏఐ




**న్యూఢిల్లీ :** కృత్రిమమేధ శరవేగంగా విస్తరిస్తోన్న తరుణంలో.. ఏఐ సంస్థలు తమ మార్కెట్‌ను విస్తరించుకునే పనిలో పడ్డాయి. ఈ ఏడాది చివరికి ఓపెన్‌ఏఐ సంస్థ బెంగళూరు, ముంబయిల్లో తన కార్యాలయాలు ప్రారంభించనుంది. ఇప్పటికే దిల్లీలో ఈ సంస్థ.. ఓపెన్‌ఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఆఫీస్ తెరిచింది. ప్రస్తుతం భారత్ ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు ఆతిథ్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. "ఏఐను అందిపుచ్చుకోవడంలో భారత్ ముందువరుసలో ఉంది. భారత్‌తో, భారత్ కోసం, భారత్‌లో ఏఐని విస్తృతం చేసేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు కలిసి పనిచేయనున్నాం" అని వెల్లడించారు. ప్రస్తుతం వారానికి 100 మిలియన్ల మందికి పైగా చాట్‌జీపీటీ యూజర్లకు ఓపెన్ ఏఐ సేవలు అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వారానికి ఈ యూజర్ల సంఖ్య 800 మిలియన్లుగా ఉంది.

### ఓపెన్ ఏఐతో జట్టు కట్టిన టీసీఎస్..

ఓపెన్ ఏఐతో జట్టు కట్టినట్లు ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రకటించింది. టెక్ పరిశ్రమలో ఉన్న సవాళ్లకు సంయుక్త పరిష్కారాలు అందించేందుకు, ఏఐ మౌలిక సదు-పాయాలను నిర్మించేందుకే ఈ భాగస్వామ్యం అని వెల్లడించింది. సామాజిక ప్రభావాలను దృష్టిలోఉంచుకొని భారత యు-వతకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. కాగా.. అధునాతన ఏఐ ఆవిష్కరణల కోసం ఆంత్రోపిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవలే బెంగళూరులో ఆంత్రో పిక్ తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# వెనెజువెలా చమురు కొనుగోలు చేసిన భారత్




**న్యూఢిల్లీ :** దేశీయ ఇంధన అవసరాలకు ఆటంకం కలగకుండా భారత్ చమురు దిగుమతి వ్యూహాలను మార్చుకుంటోంది. తాజాగా వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లను మొదలుపెట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తొలిసారి ఆ దేశం నుంచి కొనుగోళ్లు చేపట్టింది. అలాగే ప్రైవేటు సంస్థ హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ రెండేళ్లలో తొలిసారి అక్కడినుంచి ముడిచమురు కొన్నది. ఈ రెండు రిఫైనరీలు చెరో మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ వ్యవహారంపై రెండు సంస్థల నుంచి స్పందన రావాల్సిఉంది. ఇటీవల భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. అప్పుడు రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్నచోట కొనుగోలు చేస్తామనే మన దేశం వెల్లడించింది. అలాగే వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు పేర్కొంది. ఈనేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది.



# ఎముకలు విరగకపోతే నేరం కాదు

## అక్కడ గృహహింస లీగల్

**కాబుల్:** అఫ్గానిస్థాన్‌లో మహిళలపై అణచివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. తాలిబన్లు మహిళల హక్కులను కాలరాస్తూ.. ఎప్పటికప్పుడు అమానవీయ నిబంధనలను తీసుకువస్తున్నారు. తాజాగా మహిళలు, పిల్లలపై తీవ్ర వివక్ష చూపిస్తూ అరాచక చట్టాన్ని తెచ్చారు. ఎముకలు విరగకపోతే నేరం కాదంటూ గృహహింస చట్టాన్ని చట్టబద్ధం చేశారు. రక్తస్రావం కానంతవరకు ఇంట్లో మగవారు వారిని శారీరకంగా శిక్షించినా అది శిక్షార్హం కాదు. ఈ మేరకు కొత్త నిబంధనలపై అఫ్గాన్ సుప్రీంలీడర్ హిబతుల్లా అఖుంద్జాదా సంతకాలు చేశారు. ఒకవేళ భర్త క్రూరంగా ప్రవర్తించడం వల్ల ఎముకలు విరిగినట్లు బయటకు కనిపిస్తే, గాయాలు అయితే.. కేవలం 15 రోజులు మాత్రమే జైలుశిక్ష విధిస్తారు. అదికూడా తాను గృహహింసకు గురయ్యాయని మహిళ కోర్టులో నిరూపించగలిగితేనే. బాధిత మహిళ అలా కోర్టుకు వెళ్లినప్పుడు వెంట ఆమె బాధ్యత చూసుకొనే పురుషుడు ఉండాలి. అలాగే న్యాయమూర్తికి ఆమె తన గాయాలను చూపించినప్పుడు కూడా పూర్తిగా కవర్ చేసుకొనే ఉండాలట. వివాహిత తన భర్త అనుమతి లేకుండా బంధువుల వద్దకువెళ్తే.. మూడు నెలల జైలు శిక్ష పడనుంది. ఈ కొత్త శిక్షాస్మృతిలో ఆర్టికల్ 9 ప్రకారం.. అఫ్గాన్ సమాజాన్ని నాలుగు విభాగాలుగా వర్గీకరించారు. మత పెద్దలు (ఉల్మా), ఉన్నతవర్గం(అష్రాఫ్), మధ్యతరగతి, దిగువ తరగతిగా విభజించారు. దీనికింద నేర తీవ్రతను బట్టి కాకుండా ఈ వర్గాలను బట్టి శిక్షలు ఉండనున్నాయి. 2009లో అధికారంలో ఉన్న అఫ్గాన్ ప్రభుత్వం మహిళలపై హింసకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన చట్టాన్ని ఈ కొత్త పీనల్ కోడ్ రద్దు చేసింది. 2021లో పౌర ప్రభుత్వాన్ని కూల్చివేసి తాలిబన్లు అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి మహిళల హక్కులను హరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాలికల చదువుపై పరిమితులు విధించడంతో పాటు సినిమాలు చూడవద్దని.. ఒంటరిగా బయట తిరగవద్దనే ఆంక్షలు అమలుచేస్తున్నారు. ఇక, తాజా పరిణామాలపై హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కొత్త కోడ్ అమలుకాకుండా నిలిపివేసేలా చూడాలని ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకోవాలని కోరాయి.



# విమాన సర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ :** దిల్లీ, ముంబయి సహా దేశవ్యాప్తంగా ఉన్న పలు ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దాంతో వందలమంది ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. నెవిటేర్ వ్యవస్థలో 45 నిమిషాల పాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్‌ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. అయితే ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్‌ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది. దాంతో రద్దీ భారీగా పెరిగింది. ముంబయిలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దాంతో ఇండిగో, ఆకాశా ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై ప్రభావం పడింది. రిజర్వేషన్లు, చెక్‌ఇన్, బోర్డింగ్ కోసం కీలకమైన ఎయిర్‌లైన్ టెక్నాలజీని నెవిటేర్ అందిస్తోంది. అది విఫలమైతే.. ప్యాసింజర్ వివరాలను ప్రాసెస్ చేయడంలో అంతరాయం ఏర్పడుతుంది. ఇది జాప్యాలు, రద్దీకి దారితీస్తుంది. కాగా.. గత నవంబర్‌లో దిల్లీలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా 800కు పైగా విమానాలు ఆలస్యమైన సంగతి తెలిసిందే. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే దిల్లీ విమానాశ్రయం రోజుకు 1500 విమాన సర్వీసుల్ని నిర్వహిస్తోంది. ముంబయి విమానాశ్రయం నిర్వహించే సర్వీసుల సంఖ్య 1000.



# ఏఐలో జియో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు : ముకేశ్ అంబానీ

**ముంబాయి :** మొబైల్ డేటా మాదిరిగానే కృత్రిమ మేధలోనూ సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ వెల్లడించారు. ఇందుకోసం రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించారు. దిల్లీలో జరుగుతోన్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ముకేశ్ అంబానీ పాల్గొని ప్రసంగించారు. "ఏఐలో బెస్ట్ ఇంకా రావాల్సిఉంది. సుసంపన్న యుగానికి కృత్రిమ మేధ నాంది పలుకుతుంది. ఇది శక్తిని కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం చేస్తుందా..? లేదా ప్రజలందరికీ అవకాశం కల్పిస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఇందులో విప్లవం తీసుకొచ్చేందుకు మేం పని చేస్తాం. రానున్న 7 ఏళ్లలో రిలయన్స్‌తో కలిసి జియో ఇందులో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇదేదో ఊహా జనిత పెట్టుబడి కాదు. దేశ నిర్మాణానికి ఈ వ్యయం ఉపయోగపడనుంది" అని ముకేశ్ అంబానీ వెల్లడించారు. "ఇంటర్నెట్ శకానికి భారత్‌ను జియో అనుసంధానం చేసింది. ఇప్పుడు ఇంటెలిజెన్స్ శకానికి కూడా మేం అనుసంధానకర్తగా ఉండాలనుకుంటున్నాం. ప్రతి పౌరుడికి, ప్రతి రంగానికి కృత్రిమ మేధను చేరవేస్తాం. సాంకేతిక రంగంలో మౌలిక సదు-పాయాలను మరింత మెరుగుపర్చేందుకు జియో ఇంటెలిజెన్స్ నిర్విరామంగా పనిచేస్తోంది" అని ముకేశ్ అంబానీ తెలిపారు.

# స్టూడెంట్స్‌కు అడోబ్ గుడ్‌న్యూస్..

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అడోబ్ గుడ్‌న్యూస్ చెప్పింది. తన ఆధారిత క్రియేటివ్, ప్రొడక్టివిటీ టూల్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది. భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్–2026లో భాగంగా ఈ ప్రకటన చేసింది. ఈ ఆఫర్‌లో భాగంగా అడోబ్ ఫోటోషాప్, అక్రోబాట్, అడోబ్ ఫైర్‌ఫ్లై టూల్స్‌ను భారత్‌లోని గుర్తింపు పొందిన విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉచితంగా పొందొచ్చు. సాఫ్ట్‌వేర్ యాక్సెస్‌తో పాటు, ఈ టూల్స్ ఉపయోగించడంపై శిక్షణ, కరిక్యులమ్, సర్టిఫికేషన్ కూడా అడోబ్ అందించనుంది. కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ సదుపాయం ఉన్న 15వేల స్కూళ్లు, 500 కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ సౌలభ్యం లభిస్తుంది. దీంతో పాటు నాస్కామ్‌తో కలిసి లెర్నింగ్ కోర్సులు, సర్టిఫికేషన్లను కూడా అడోబ్ అందించనుంది. దీన్ని అడోబ్ వ్యూహాత్మక పెట్టుబడిగా అభివర్ణించింది. భారతదేశంలోని లక్షలాది మంది విద్యార్థులకు సృజనాత్మకతను పెంచేందుకు అడోబ్ తనవంతు కృషి చేస్తోందని, నైపుణ్యాలను పొందడంలో సహకరిస్తోందని అడోబ్ ఛైర్మన్, సీఈఓ శంతను నారాయణ్ పేర్కొన్నారు.




# భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు
# కొనసాగించాలనుకుంటున్నాం

## బంగ్లా క్రీడామంత్రి అమీనుల్ హక్




బంగ్లాదేశ్ జాతీయ జట్టు మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, నూతన క్రీడా మంత్రి అమీనుల్ హక్.. బీసీసీఐ, భారతదేశంతో తమ సంబంధాలను పునరుద్ధరించడానికి ఆసక్తిని కనబరిచారు. ప్రస్తుతం భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ గైర్హాజరును ప్రస్తావించారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత డిప్యూటీ హైకమిషనర్‌ను ఇప్పటికే కలిసి.. టీ20 ప్రపంచ కప్ గురించి చర్చించానని అన్నారు. చర్చలు మంచి వాతావరణంలో జరిగాయన్నారు. 'ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, పార్లమెంటు భవనంలో భారత డిప్యూటీ హైకమిషనర్‌ను కలిశాను. టీ 20 ప్రపంచ కప్ గురించి చర్చించాను. ఇది ఒక స్నేహపూర్వక సంభాషణ. పొరుగు దేశాలన్నింటితో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలనుకుంటున్నాం. చర్చల ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోవాలని భావిస్తున్నానని ఆయనకు చెప్పాను' అని అన్నారు. క్రీడలతో సహా అన్ని రంగాల్లో భారతదేశంతో స్నేహపూర్వక సంబంధాన్ని ఏర్పరచుకోవాలని బంగ్లాదేశ్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దౌత్యపరమైన సమస్యల వల్ల బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు.. 2026 ప్రపంచ కప్‌లో పాల్గొనలేకపోతోందని ఆయన వాపోయారు. 'క్రీడలతోపాటు ఇతర రంగాల్లో భారత్‌తో నిజాయతీ, స్నేహపూర్వక సంబంధాన్ని ఏర్పరచుకోవాలనుకుంటున్నాం. దౌత్యపరమైన చిక్కుల కారణంగా, ప్రపంచ కప్‌లో ఆడలేకపోయామని మీకు తెలుసు. ఆ సమస్యలను ముందుగానే చర్చించి పరిష్కరించుకుని ఉంటే, మా జట్టు పాల్గొని ఉండేది' అని పేర్కొన్నారు. భారత్‌లో తమ జట్టుకు భద్రతపరమైన సమస్యలను సాకుగా చూపి, తమ మ్యాచులను శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ కోరిన విషయం తెలిసిందే. అయితే భారతదేశంలో భద్రతా ప్రమాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఐసీసీ అందుకు అంగీకరించలేదు. దీంతో బంగ్లా పొట్టిప్రపంచకప్ నుంచి తప్పుకుంది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుతో చర్చల అనంతరం బంగ్లాపై ఆంక్షలు విధించబోమని ఐసీసీ ప్రకటించింది.



## సిక్స్‌లు ఎప్పుడు కొట్టాలో నాకు తెలుసు : శివమ్ దూబె

టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ శివమ్ దూబె తన మెరుగైన ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నాడు. ఒకప్పుడు అతడి పేరు చెబితే.. స్పిన్నర్లను బాగా ఆడతాడు అనేవారు. కానీ ప్రస్తుతం సీమ్ బౌలర్లనూ ఉతికి ఆరేస్తున్నాడు. షార్ట్ పిచ్ బంతులనూ చక్కగా ఆడుతున్నాడు. తాజాగా బుధవారం పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శివమ్ దూబె 66 పరుగులు (31 బంతుల్లో, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) సాధించాడు. ముఖ్యంగా కళ్లు చెదిరే సిక్స్‌లతో అలరించాడు. మొదట కొన్ని డాట్ బాల్స్ ఆడినప్పటికీ.. తర్వాత గేర్ మార్చాడు. ఈ విషయమై దూబె మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. 'టీ20 క్రికెట్‌లో డాట్ బాల్స్ ఆడితే ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది. కానీ ఓ బ్యాటర్‌గా ఎప్పుడు వేగంగా ఆడాలో నాకు తెలుసు. ఒకవేళ నేను 10 బంతుల్లో కేవలం 2 పరుగులు చేశానే అనుకోండి. తర్వాత అయిదు బంతుల్లో నేను రెండు సిక్స్‌లు కొడితే.. సరిపోతుంది' అని దూబె అన్నాడు. 'ఆ విషయం ఎప్పటికీ నా మనసులో ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఆడిన ప్రతిసారీ మనం నేర్చుకుంటాం. అందుకే నేను ఆడాను.. తెలివిగా మారాను. నాకు ఏ బౌలర్ ఎప్పుడు ఏ బంతి వేస్తాడో అని కాస్త ముందుగానే పసిగట్టగలుగుతున్నా. ఫాస్ట్ బౌలర్ స్లో బంతులు సంధించగలడని నాకు తెలుసు. నేను వీటిమీద చాలా ప్రాక్టీస్ చేశాను. నేను మెరుగవుతున్నాను' అని శివమ్ దూబె పేర్కొన్నాడు. షార్ట్ పిచ్ బంతుల విషయంలో తాను ఎలా కసరత్తు చేశాడో అతడు వివరించాడు. 'మొదట్లో షార్ట్ పిచ్ బంతులు ఆడటం కష్టంగా ఉండేది. ఐపీఎల్ మొదటి సీజన్‌లో కొన్ని పరుగులు మాత్రమే చేయగలిగాను. నేను షార్ట్ బంతుల్ని ఎలా ఆడాలో సాధన చేశాను. తర్వాతి సీజన్‌లో నేను మరిన్ని రన్స్ సాధించాను' అని శివమ్ దూబె వివరించాడు. టీ20 వరల్డ్‌కప్ 2026లో గ్రూప్ స్టేజీలో టీమ్‌ఇండియా నాలుగు మ్యాచులకు గానూ నాలుగింట్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. గ్రూప్8లో భాగంగా టీమ్‌ఇండియా దక్షిణాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్‌తో తలపడనుంది. శివమ్ దూబె ఇకముందు కూడా ఈ మెగా టోర్నీలో బ్యాట్, బంతితో రాణించి టీమ్‌ఇండియా విజయాల్లో కీలక పాత్ర పోషించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఓడిన భారత మహిళా జట్టు



**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళా జట్టుకు ఓటమి ఎదురైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో భారత్‌పై ఆసీస్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. అనంతరం భారత్ 9 వికెట్లను కోల్పోయి 144 పరుగులే చేయగలిగింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (36), స్మృతి మందాన (31), షెఫాలీ వర్మ (29), రిచా ఘోష్ (19) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డెనర్ 3, కిమ్ గార్త్ 2, అన్నాబెల్ సదర్లాండ్ 2, సోఫీ 2 వికెట్లు తీశారు. తొలి టీ20లో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. ఇక సిరీస్ విజేతను తేల్చే ఆఖరి మ్యాచ్ ఫిబ్రవరి 21న అడిలైడ్ వేదికగా జరగనుంది. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' జార్జియా వోల్ (88) అద్భుతంగా హాఫ్ సెంచరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 163 పరుగులు రాబట్టింది. బెత్ మూనీ (46) రాణించింది. పెర్రీ (7), ఫోయబ్ లిట్చ్‌ఫీల్డ్ (6) విఫలమయ్యారు. ఆష్లే గార్డెనర్ 10 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అరుంధతిరెడ్డి 2, రేణుకా సింగ్ ఠాకూర్ ఒక వికెట్ తీశారు.

# పొట్టి కప్‌లో మరో సంచలనం

## శ్రీలంకకు షాక్ ఇచ్చిన జింబాబ్వే



**కొలంబో:** టీ20 ప్రపంచ కప్‌లో జింబాబ్వే మరో సంచలనం నమోదు చేసింది. గ్రూప్ స్టేజ్‌ను అగ్రస్థానంతో ముగించింది. తొలుత ఆస్ట్రేలియాను ఓడించిన ఆ జట్టు.. లీగ్ స్టేజ్ తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఇప్పటికే శ్రీలంక, జింబాబ్వే సూపర్–8కి చేరాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 178/7 స్కోరు చేసింది. అనంతరం జింబాబ్వే బ్యాటింగ్ ప్రారంభించింది. 19.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. మూడో వికెట్‌కు వీరిద్దరూ కలిసి 40 బంతుల్లోనే 69 పరుగులను జోడించారు. బ్రియాన్ బెనెట్ (63) హాఫ్ సెంచరీ సాధించగా.. సికందర్ రజా (45) దూకుడుగా ఆడేశాడు. 19వ ఓవర్‌లో హేమంత రెండు వికెట్లు తీసి జింబాబ్వేను కాస్త భయపెట్టాడు. అయితే, బెనెట్‌తో కలిసి మున్యాంగా (8) విజయతీరాలకు చేర్చాడు. శ్రీలంక బౌలర్లలో హేమంత 2.. వెల్లలాగే, శనక చెరో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ నెగ్గిన శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకుంది. పాథున్ నిశాంక (62) హాఫ్ సెంచరీ సాధించడంతో.. శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. పవన్ రత్నాయకే (44), కుశాల్ పెరీరా (22) రాణించారు. కుశాల్ మెండిస్ (14), కమిందు మెండిస్ (7), దాసున్ శనక (6) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 2, గ్రీన్ క్రెమెర్ 2, ఇవాన్స్ 2, బర్ల్ ఒక వికెట్ తీశారు.

### టీమ్‌ఇండియాకు వార్నింగే..

ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా జింబాబ్వే సూపర్ –8లో అడుగు పెట్టింది. మూడు మ్యాచుల్లో విజయం సాధించగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. పెద్ద జట్లకు షాక్ ఇచ్చిన జింబాబ్వే ఆటతీరుతో ఇప్పుడు భారత్‌కు సవాల్ తప్పదని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే సూపర్ –8లో జింబాబ్వే మన గ్రూప్‌లోనే ఉంది. విండీస్, దక్షిణాఫ్రికాతోనే కాకుండా జింబాబ్వే కూడా గట్టిపోటీనివ్వడం ఖాయమని తెలుస్తోంది. ఫిబ్రవరి 26న జింబాబ్వేతో భారత్ ఆడనుంది.



# 8 లక్షల కోట్లు ఆవిరి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు కుదేలయ్యాయి. ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడి చేస్తుందన్న భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లపై గందరగోళం కారణంగా సూచీలు నేలచూపులు చూశాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్ల సంపద దాదాపు రూ.8 లక్షల కోట్లు ఒక్కరోజులోనే ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఓ దశలో 1400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,969.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,734.25) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఈ క్రమంలో ఇంట్రాడేలో 82,264.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1236.11 పాయింట్ల నష్టంతో 82,498.14 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 365 పాయింట్ల నష్టంతో 25,454 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్కటంటే ఒక్కటీ లాభపడలేదు. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

### ప్రధాన కారణాలు ఇవే..

- ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడికి పాల్పడొచ్చనే భయాలు మన మార్కెట్ సూచీల పతనాన్ని శాసించాయి. ఓ వైపు పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలాన్ని మోహరిస్తుండగా.. ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనే పనిలో పడింది. దీనికితోడు ఉక్రెయిన్– రష్యా మధ్య అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.
- అమెరికా ఫెడ్‌కు సంబంధించిన మినిట్స్ తాజాగా బయటికొచ్చాయి. వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్ అధికారుల విషయంలో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తదుపరి ద్రవ్యోల్బణ గణాంకాలు వచ్చేంత వరకు వేచి చూడాలని కొందరు అభిప్రాయపడుతుండగా.. మరికొందరు మాత్రం ద్రవ్యోల్బణం తిరోగమనం పట్టేంత వరకు వడ్డీ రేట్లు తగ్గించకూడదన్న అభిప్రాయంతో ఉన్నారు. దీర్ఘకాలం పాటు అమెరికా వడ్డీ రేట్లు తగ్గించకపోతే భారత్ వంటి వర్ధమాన మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుముఖం పడుతుంది.
- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకొన్న వేళ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్ల మార్కును దాటింది. దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూలాంశం. పైగా సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల వరుస లాభాల వేళ మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, మార్కెట్ సూచీలను ముందుకు నడిపించే పాజిటివ్ అంశాలేవీ లేకపోవడంతో మార్కెట్ సూచీలు భారీగా నష్టపోయాయి.



# ఏఐ రాకతో లేఆఫ్‌ల్లోనూ పోటీ

## హెచ్చరించిన అమెరికా వ్యాపారవేత్త

కృత్రిమమేధతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది. అమెరికా వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ చేసిన వ్యాఖ్యలు అందుకు తగ్గట్టే ఉన్నాయి. రానున్న 12–18నెలల్లో లక్షల ఉద్యోగాలు పోతాయని, వాటిల్లో భారీ సంఖ్యలో వైట్‌కాలర్ జాబ్స్ ఉంటాయని జోస్యం చెప్పారు. కోడర్స్, మార్కెటర్స్, మిడిల్ మేనేజర్లు, కాల్ సెంటర్ సిబ్బంది అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఒక సంస్థ తన ఉద్యోగుల సంఖ్యలో కోతపెడితే.. ప్రత్యర్థులు కూడా అలాంటి నిర్ణయాలు అమలు చేయాల్సిన ఒత్తిడి తలెత్తుందన్నారు. "సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటే స్టాక్‌మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుంది. లేకపోతే భిన్నంగా ఉంటుంది. దాంతో ఇదొక పోటీగా మారుతుంది" అని యాంగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నాన్ టెక్నికల్ విభాగంలో కూడా ఏఐ ప్రభావం ఉంటుందని యాంగ్ వెల్లడించారు. "డ్రై క్లీనర్, డాగ్ వాకర్, హెయిర్‌స్టైలిస్ట్ లాంటి ఉద్యోగాల్లో కొందరు ఉన్నారనుకుందాం. ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారికి ఉపాధిపోతే ఆ ప్రభావం ఈ చిన్న ఉద్యోగస్థులపై పడుతుంది. ఉతకడానికి బట్టలు ఇవ్వరు. వారి కుక్కలను వారే తీసుకువెళ్తారు. సెలూన్‌కు వెళ్లడం తగ్గిస్తారు" అని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. కోడ్‌ను ఏఐ మోడల్స్ రాస్తుంటే ఇంజినీర్లకు ఏం పని మిగులుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. "కోడింగ్ అనేది ఉద్యోగంలో ఒక భాగం మాత్రమే. ఏఐ వ్యవస్థలకు సరైన ప్రాంప్ట్‌లు ఇవ్వడం, ఇతర బృందాలను సమన్వయం చేసుకోవడం, కస్టమర్లతో అనుసంధానం అవ్వడం, తర్వాత ఎలాంటి ఫీచర్‌ను తీసుకురావాలి..? అనే అంశాలపై రీసెర్చ్ చేయడం వంటి పనులు ఇంజినీర్లకు ఉన్నాయి" అని ఏఐ నిపుణులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# అనుమతి లేకుండా భారత్ వీడను

## అనిల్ అంబానీ



ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీం కోర్టుకు తెలిపారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉన్న రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో ఏజెన్సీల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈమేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. "ఈ కేసుల్లో దర్యాప్తు మొదలు.. గతేడాది జులై నుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతానికి విదేశాలకు వెళ్లే ఉద్దేశం, ప్రణాళికలేవీ లేవు. ఒకవేళ విదేశీ ప్రయాణం చేయాల్సి వస్తే.. కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటాను. సంబంధిత కేసుల్లో దర్యాప్తు సంస్థలకు అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. మున్ముందు కూడా కొనసాగిస్తాను" అని అనిల్ అంబానీ తెలిపారు. చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని పేర్కొన్నారు. మనీలాండరింగ్ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేసిందని, హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన ప్రవర్తన పారదర్శకంగా, కేసుల దర్యాప్తునకు సహకరించే విధంగా ఉందని చెప్పేందుకే ఈ అఫిడవిట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ కేసుల దర్యాప్తులో జాప్యంపై ఈ నెల 4న సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తును ముమ్మరం చేయాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# మిరాకిల్ షూట్‌లో ఎంటర్‌కానున్న హెబ్బా పటేల్

టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెండ్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.


# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయ-ంబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.



# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.







# కేరళ స్టోరీ-2కు యూ/ఏ సర్టిఫికెట్ జారీ

మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## విజయ్ దేవరకొండతో మాత్రమే

# లిప్ లాక్ సీన్ చేస్తాను

టాలీవుడ్ ఇండస్ట్రీలో అద్భుతమైన గుర్తింపును అత్యంత తక్కువ సమయంలో సంపాదించుకున్న వారిలో మిల్కీ బ్యూటీ తమన్నా ఒకరు. ఈ నటి శ్రీ అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యి, ఆ తర్వాత హ్యాపీ డేస్ తో బ్లాక్ బాస్టర్ను అందుకొని మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలను దక్కించుకున్న ఈ బ్యూటీ చాలా తక్కువ కాలంలోనే టాలీవుడ్లో స్టార్ హీరోయిన్ స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత ఈ సీనియర్ హీరోయిన్ అనేక ఇతర భాషల సినిమాల్లో కూడా నటించి ఇండియా వ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పటివరకు తమన్నా ఎన్నో తెలుగు సినిమాల్లో నటించింది, ఎంతోమంది స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. కానీ ఇప్పటివరకు ఎవరికీ కూడా ఈమె లిప్ లాక్ ఇవ్వలేదు. కొంతకాలం క్రితం ఈమె సమంత హోస్ట్ చేసిన ఓ షోకి గెస్ట్ గా వచ్చింది. అందులో ఈమె కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను తెలియజేసింది. తాజాగా తమన్నా మాట్లాడుతూ... "నేను తెలుగు హీరోల్లో లిప్ లాక్ సన్నివేశం చేయాల్సి వస్తే ఒకే ఒక్క హీరోతో చేస్తాను, ఆయన మరెవరో కాదు విజయ్ దేవరకొండ" అని సమాధానం ఇచ్చింది. ఇప్పటివరకు మిల్కీ బ్యూటీ తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న అనేకమంది స్టార్, మీడియం, చిన్న హీరోలతో నటించింది, కానీ విజయ్ దేవరకొండతో మాత్రం నటించలేదు. ఒకవేళ తెలుగు హీరోల్లో ఎవరికైనా లిప్ లాక్ ఇవ్వాల్సి వస్తే విజయ్ కి మాత్రమే ఇస్తాను అని చెప్పడంతో వీరిద్దరి కాంబోలో సినిమా వస్తే అందులో లిప్ లాక్ సన్నివేశం ఉండే అవకాశాలు ఉన్నాయి అని చాలామంది అభిప్రాయపడుతున్నారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com